అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 20 ఏప్రిల్ 2023

బాలికపై అత్యాచారయత్నం

- యువకుడిపై ఫోక్సో చట్టం కింద కేసు

నవతెలంగాణ - దహెగాం

మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..రెండు రోజుల క్రితం బాలిక సమీపంలోని ఒర్రెకు వెళ్లగా గమనించిన అదే గ్రామానికి చెందిన యువకుడు అనిల్ పుల్లూరివార్ అత్యాచారయత్నం చేశాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

బెల్లంపల్లి, రామగుండం రీజియన్‌లో పనిచేస్తున్న ఈపి ఆపరేటర్లకు వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని హెచ్ఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ 2021 నుండి బి గ్రేడ్ నుండి సి గ్రేడ్ ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఇవ్వకపోవడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. సింగరేణిలో అన్ని ఏరియాలో డి గ్రేడ్ నుండి సి గ్రేడ్ ప్రమోషన్లు ఇచ్చి శ్రీరాంపూర్, బెల్లంపల్లి, రామగుండం రీజియన్‌లో ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఈపి ఆపరేటర్లకు సి గ్రేడ్ ప్రమోషన్ ఇచ్చి సంబంధిత ఏరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ సొమ్ము మాయం..?

- ఐదేండ్లుగా ఖాతాల్లో జమ కాని వైనం
- కార్మికుల నిరసన ..విషయం వెలుగులోకి
- రూ.1.35కోట్లు పక్కదారి పట్టినట్లు సమాచారం
- సరిదిద్దేందుకు అధికారుల ప్రయత్నాలు

మున్సిపల్ కార్మికుల వైద్య సదుపాయం కోసం జమ చేయాల్సిన ఈఎస్ఐ సొమ్ము మాయమైనట్లు తెలుస్తోంది. కార్మికుల వేతనం నుంచి ప్రతి నెలా కట్ చేస్తున్న డబ్బులతో పాటు వాటికి జమ చేయాల్సిన మున్సిపాలిటీ డబ్బులు సైతం పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. కార్మికులకు అందజేయాల్సిన ప్లే స్లిప్‌లో ఈఎస్ఐ డబ్బులు జమ చేయకపోవడంతో అనుమానం వచ్చిన కార్మికులు ఈ విషయంపై ఆరా తీశారు. గత ఐదేండ్లుగా కార్మికుల జీతం నుంచి కట్ చేస్తున్న సొమ్ముతో పాటు మున్సిపాలిటీ ద్వారా జమ చేయాల్సిన డబ్బులు కూడా జమ కావడం లేదని తెలుసుకొని నిరసన చేపట్టారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా విభాగాల అధికారులకు షోకాజ్ నోటీసులు పంపించినట్లు తెలిసింది. ఈ విషయం బయటపడగానే ఎక్కువ మాట్లాడిన కార్మికులను విధుల నుంచి తొలగిస్తామని కొందరు అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఒప్పంద ప్రతిపాధికన 450మంది కార్మికులు పనిచేస్తున్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, ఎలక్ట్రిషిటీ, కార్యాలయం తదితర విభాగాల్లో పనిచేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి వీరికి నెలకు రూ.15వేల వేతనం రాగా ఇందులో నుంచి పీఎఫ్ కోసం రూ.వెయ్యి కట్ కాగా ఈఎస్ఐ సొమ్ము ఒక్కో కార్మికుడి నుంచి ప్రతినెలా రూ.150 కట్ అవుతున్నాయి. ఈ డబ్బులకు మున్సిపాలిటీ సొమ్మును అదనంగా రూ.350 జమ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు కలిపితే ప్రతి నెలా ఒక్కో కార్మికుడికి ఈఎస్ఐ రూపేణా రూ.500 జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఆదిలాబాద్ మున్సిపాలిటీలో కొందరు అక్రమార్కులు ఈ నిధులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలున్నాయి. కార్మికుల జీతం నుంచి సొమ్మును కట్ చేస్తున్నా ఆ నిధులను ఈఎస్ఐ ఖాతాల్లో మాత్రం జమ చేయడం లేదు. అదనంగా నిధులు వాటికి కలపడం లేదు. గత ఐదేండ్లుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిన ఈ సొమ్మును జమ చేయడం లేదనే కొందరు కార్మికులు చెబుతున్నారు. కార్మికులకు ప్రతినెలా అందించే పే స్లిప్‌ల్లోనూ ఈఎస్ఐకి జమ చేసినట్లు లేకపోవడంతో అనుమానం వచ్చిన కార్మికులు మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేసి నిరసన తెలిపారు. దీంతో అధికారులు ఈ వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది.

రూ.1.35కోట్లు దుర్వినియోగం..?

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఒప్పంద ప్రతిపాధికన ఆయా విభాగాల్లో 450మంది కార్మికులు పనిచేస్తుండగా ఒక్కొక్కరికి ఈఎస్ఐ సదుపాయం కింద ప్రతి నెలా రూ.500 జమ కావాల్సి ఉంటుంది. ఏడాదికి ఒక్కొక్కరికి రూ.6వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఐదేండ్ల పాటు ఈఎస్ఐ జమ చేయకపోవడంతో కార్మికులందరివి కలిపి ఇప్పటి వరకు రూ.1.35కోట్లు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. అనునిత్యం పట్టణ పరిశుభ్రత కోసం పాటుపడుతున్న పారిశుధ్య కార్మికులకు చెందాల్సిన నిధులను వారికి తెలియకుండా పక్కదారి పట్టించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కార్మికుల ఈఎస్ఐకి సంబంధించి నెంబర్లు జనరేట్ చేయకపోవడంతోనే ఈ సొమ్ము జమ చేయలేదని చెబుతున్నారు. కానీ ఐదేండ్ల నుంచి నెంబర్లు కేటాయించడంలో అధికారులకు తీరక లేదా అనే సంశయం వ్యక్తమవుతోంది. దీంతో వివిధ విభాగాల అధికారుల వైఖరిపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి.

అడిగితే తొలగిస్తారని భయం..?

గత కొన్నేండ్లుగా ఈఎస్ఐ సొమ్ము జమ కావడం లేదని కొందరు కార్మికులకు తెలిసినప్పటికీ ఈ విషయం మాట్లాడితే ఎక్కడ విధుల నుంచి తొలగిస్తారోనని భయపడుతున్నారు. కానీ ఐదేండ్ల నుంచి ఈఎస్ఐ నిధులు జమ కాకపోవడంతో తీవ్ర అసంతృప్తి..ఆవేదనతో ఉన్న కార్మికులు ఎట్టకేలకు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. కార్యాలయం ఎదుట కార్మికులందరు కలిసి మూకుమ్మడిగా నిరసన తెలపడంతో అసలు విషయం బయటపడింది. ఐదేండ్లుగా ఈఎస్ఐ సొమ్ము జమ కావడం లేదని కార్మికులు చెబుతుండటం చర్చకు దారితీసింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు కార్మికులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. కానీ అదే రోజు సాయంత్రం కొందరు అధికారులు కార్మికులను బెదిరించినట్లు తెలిసింది. ఈ విషయం మీద ఎక్కువగా మాట్లాడిన వారిని విధుల నుంచి తొలగిస్తామని హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో భయపడిన కార్మికులు మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఈఎస్ఐ ఎందుకు జమ చేయలేదు..ఈ సొమ్మంతా ఎక్కడికి పోయింది..తదితర విషయాలపై ఆరా తీస్తే కార్మికులకు న్యాయం జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

షోకాజ్ నోటీసులు అందించాం : శైలజ, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

ఈఎస్ఐ నెంబర్లు జనరేట్ చేయడంలో సమస్య ఉన్నట్లు గుర్తించాం. రాష్ట్రంలోని చాలా మున్సిపాలిటీల్లో ఈ సమస్య ఉంది. ఇక్కడ ఎందుకు నెంబర్లు జనరేట్ చేయలేదో ఆయా విభాగాల అధికారులకు మెమోలు జారీ చేశాం. త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

నిరవధిక దీక్షను అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-బేల

గత ఏడాది జూన్ నెలలో విక్రాంత్ రకం సోయాబీన్ విత్తనాలు వేసి పంట నష్ట పోయిన రైతుల పక్షాన బుధవారం వ్యవసాయ కార్యాలయం ముందర యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి నిరవధిక దీక్షకు సిద్దమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సామ రూపేష్‌రెడ్డిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌కు జైనథ్ సీఐ కోలా నరేష్ వ్యవసాయ అధికారులను పిలిచి నేటి వరకు డబ్బులు అందని రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు విక్రాంత్ సీడ్స్ కంపెనీ వారితో మాట్లాడి వారం రోజుల్లో నష్టపోయిన రైతులకు డబ్బులు అందేలా చూస్తామని హామీ ఇప్పించి దీక్షను విరమించేలా చేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఫైదుల్లా ఖాన్ మాట్లాడుతూ పది రోజులు వేచి చూస్తామని, అప్పటికి డబ్బులు రాకపోతే రైతుల పక్షాన నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో మాజీ జెడ్పిటిసి రాందాస్ నాక్లే, మాజీ సర్పంచ్ ఘనశ్యామ్, మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు మడావి చంద్రకాంత్, ఎండి అఖిల్, విపిన్ ఠాక్రే, అవినాష్ గోడే, సుమిత్ ఠాక్రె, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, దత్తు, ప్రమోద్‌రెడ్డి ఉన్నారు.

సమ్మె శిబిరంలో ఉద్యమ తరగతులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఐకేపీ వీఓఏల సమ్మె శిబిరంలో బుధవారం కాగజ్‌నగర్‌లో ఉద్యమ తరగతులు నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. మూడో రోజు సమ్మె శిబిరంలో ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఆర్ రాజేశం 'పోరాటం నేర్పిస్తున్న శ్రామిక వర్గ సంస్కృతిని అలవర్చుకుందాం' అంశంపై ఉద్యమ తరగతి నిర్వహించారు. ఐక్యపోరాటాల ద్వారానే హక్కులు దక్కుతాయనే సత్యం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే నిరూపణ జరిగినట్లు తెలిపారు. పోరాటం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు దక్కుతాయని, ఆ పోరాటం నేర్పే సంస్కృతి కూడా మనం స్వీకరించాలని సూచించారు. ఏ భావజాలం వెనుక ఎవరి వర్గ ప్రయోజనాలున్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారనే లెనిన్ హెచ్చరికను కార్మికులు జ్ఞాపకం ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి సిరిశెట్టి శ్రీనివాస్, సంఘం నాయకులు లలిత, గీత, వనిత, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

కుమురం భీం విగ్రహావిష్కరణ వార్షికోత్సవం



నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని ముంజంపెల్లి గ్రామంలో బుధవారం కుమురం భీం విగ్రహావిష్కరణ వార్షికోత్సవాలను గిరిజన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, జెడ్పీటీసీ పుష్పలత, బీఆర్ఎస్ నాయకుడు దోకె వెంకన్న భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిడాం సకారాం, సర్పంచ్ చాప్లె కళావతి లచ్చన్న, ఉప సర్పంచ్ గెడం అశోక్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కోటపల్లి : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యా సాగర్ అన్నారు. గురువారం మండలంలోని నక్కలపల్లి గ్రామంలో ఎస్ఐ వెంకట్, సీఐ విద్యాసాగర్ ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు ఫ్రెండ్లీగా అందుబాటులో ఉంటారని, ఒక్క ఫోన్ కాల్‌తో సమస్యను తీరుస్తామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. అనంతరం యువతకు క్రీడా సామాగ్రి అందజేశారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

కాగజ్‌నగర్ : కాకతీయ విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందిన కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డి లక్ష్మీనరసింహంను అధ్యాపకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ రాజు మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో కొనసాగుతూనే తెలుగు సాహిత్యంలో పీహెచ్‌డీ పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డి జనార్దన్, అధ్యాపకులు రాజేశ్వర్, టి దత్తాత్రేయ, వి దేవేందర్, డాక్టర్ డి టేమాజీ, వెంకటేశం, శారద, రోజ్‌మేరి పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాంకేతిక శిక్షణ సంస్థలో దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ : జిల్లా పరిధిలో గల పదవ తరగతి ఉత్తీర్ణులైన అనాథ, నిరాశ్రయులైన, తల్లి లేదా తండ్రి ఇరువురిలో ఒక్కరే ఉన్న బాలికల నుండి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళ సాంకేతిక శిక్షణ విద్యా సంస్థ, హైదరాబాదులో 2023-24విద్యాసంవత్సరానికి అడ్మిషన్ కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులలో అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు మే నెల 9లోపు మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 9491460658 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో సీటు భర్తీకి దరఖాస్తులు

ఆసిఫాబాద్ : బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ఖాళీగా ఉన్న ఒక సీటు భర్తీ కోసం జిల్లాలో ఆసక్తి ఉన్న ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 1 లోపు జిల్లా కేంద్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒకటి కంటే ఎక్కువగా దరఖాస్తు వచ్చినట్లయితే మే4న లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 7013397514 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వీఓఏలకు రూ.26వేల వేతనం చెల్లించాలి

నవతెలంగాణ - కాసిపేట

వీవోఏల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఉద్యోగభద్రత కల్పించి రూ.26వేల వేతనం చెల్లించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం ప్రదీప్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెసిఆర్ బంగారు తెలంగాణ ఇదేనా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గుండా రాజకుమార్, సల్లూరి సమీల్, పిడుగు మనోహర్, దుర్గం ప్రవీణ్, జాడి మల్లేష్, సురేష్, గోనె రాజన్న, సంజు, రఘు పాల్గొన్నారు.

తాండూర్ : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజుకు చేరుకుంది. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలువేరు శేషగిరి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ సమ్మెకు మద్దతు తెలిపారు.



కాసిపేట

బెజ్జూర్ : ఐకేపీ కార్యాలయం ముందు వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని బుధవారం బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని, అందరిని పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన నేటికి నెరవేర్చడం లేదన్నారు. 17వేలకు పైగా వీఓఏలు విధులు నిర్వహిస్తున్నారని, వారికి కనీస వేతనం ఇవ్వకపోగా వారి డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వీఓఏల డిమాండ్లను వెంటనే పరిష్కరించి వారి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మడలాధ్యక్షుడు జాడి దిగంబర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు చునార్కర్ సాయి, బీజేపీ నాయకులు ధనికె శ్యాంసుందర్, గోపాల్ పాల్గొన్నారు.



బెజ్జూర్

కెరమెరి : వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కూటికల ఆనంద్‌రావ్ అన్నారు. బుధవారం నిరవధిక సమ్మె మూడోవ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కొన్ని రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డురమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్, వివోఏలు ఇందిర, సుజాత, శారద, పార్వతి, రమేష్, ధర్మరావు, మారుతి, రఘునాథ్, పున్నంచంద్, బాబుసింగ్ పాల్గొన్నారు.

దళిత కాలనీపై వివక్ష తగదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



జన్నారం : మండల కేంద్ర పరిధిలోని బుడగ జంగాల కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ-ఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. బుధవారం కాలనీని పార్టీ నాయకులతో కలిసి సందర్శించి పరిస్థితులను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుడగ జంగాల కాలనీ వెలిసి 17 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ఇప్పటివరకు రోడ్లు, విద్యుత్తు, మంచినీటి సౌకర్యం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దళితవాడలను పట్టించుకోవడం లేదన్నారు. బుడగ జంగాల కాలనీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కనికరం అశోక్, నాయకులు జయ, రాజన్న, అనూష, మౌనిక, గిరిజాబాయి, విజయ్, లింగన్న, బుచ్చన్న పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ : నోటిఫికేషన్లు లేకుండా అభ్యర్థుల నుండి డబ్బులు వసూలు చేస్తూ ఉద్యోగాలు భర్తీ చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను కొంతమంది స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసుకొని ఇతర జిల్లాల నుండి వచ్చి అవుట్ సోర్సింగ్ టెండర్లు దక్కించుకొని ఆస్పత్రులు, ఆశ్రమ పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నారన్నారు. దీంతో అర్హత కలిగిన యువత నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఒక కుటుంబానికి ఒకటి కంటే ఎక్కువగా ఉన్నాయని అటువంటి వాటిని గుర్తించి రద్దు చేయాలన్నారు. ఉపాధి కల్పన శాఖ అధికారి వీటిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ విధంగా జరగడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు జిల్లా యువతకు ఉపాధి కల్పించడంలో చొరవ చూపాలని, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నిఖిల్, నాయకులు జాడి తిరుపతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

నవతెలంగాణ - భీమిని

20న విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక జనకాపూర్ ఉపకేంద్రంలో నిర్వహిస్తున్నామని బెల్లంపల్లి డీఈ రాజన్న తెలిపారు. భీమిని, కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి మండల వినియోగదారులు ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- 29న చలో లేబర్ కమిషనర్ ఆఫీస్
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ- మంచిర్యాల

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 29న జరిగే చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి హమాలీల శ్రమ నుండి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా వారి సంక్షేమం కోసం నయాపైసా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. కేంద్రంలో బిజెపి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మిక హక్కులన్నీ హరించుకుపోతాయని తెలిపారు. చట్టబద్ధ సౌకర్యాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, 8గంటల పని విధానం, కనీస వేతనాలు ఉండవని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పని ప్రదేశాల్లో టాయిలెట్లు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ తీర్మానం ప్రకారం 50 కేజీలకు మించిన బరువులను నిషేధించాలని కోరుతూ 29న హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీలు రాజన్న, శేఖర్, రాములు, సంపత్, శ్రీను పాల్గొన్నారు.

22న బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖారావ సదస్సు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 22న హైదరాబాద్‌లోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాలులో బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖారావ సదస్సును నిర్వహించనున్నట్లు బహుజన ఉద్యోగులు మేడి చరణ్‌దాస్, వెంకట్, జాడి కేశవ్, దుర్గం విస్తారు. జంగం లక్ష్మయ్య, దుర్గం మోహన్, డాక్టర్ డొంగ్రి తేమాజీ, సంతోష్ తదితరులు తెలిపారు. బుధవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగులంతా సంఘటితంగా పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. అన్ని రంగాల ఉద్యోగాలలో 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయడం, ప్రైవేటీకరణను పూర్తిగా రద్దు చేయడం, ప్రైవేటీకరించబడ్డ విద్యుత్, రైల్వే, టెలికం, ఎల్ఐసీ, బ్యాంక్, విమానయాన సంస్థలను తిరిగి జాతీయాకరణ చేయడం తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. దీనికి 33 జిల్లాల బహుజన ఉద్యోగులు హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గజానంద్, ప్రదీప్‌కుమార్, విలాస్ దుర్గె, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి



కాసిపేట : దళిత ప్రజాప్రతినిధిని దూషించి అవమానపరిచిన ఎస్ఐ మీద చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల నాయకులు సోమగుడెం ఉప సర్పంచ్ కనుకుల రాకేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం చాకెపెల్లి ఎంపిటిసి బెల్లంపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ భార్యాభర్తల పంచాయతీ విషయంలో ఎస్ఐ చంద్రకుమార్‌ను కలిసే ప్రయత్నం చేశారన్నారు. వివరాలు తెలుసుకోకుండానే ఎస్ఐ ఇష్టానుసారంగా మాట్లాడి అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. అంతేకాకుండా బ్రీత్ ఎనలైజర్ పెట్టి అవమానపరిచారని తెలిపారు. వెంటనే ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, యువజన నాయకులు వెంకటేష్, జంగిలి రమేష్, నవీన్, ప్రేమ్ కుమార్, మార్నేని వంశీ పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ



బెజ్జూర్ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం రంజాన్ కిట్లను జెడ్పీటీసీ పుష్పలత లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ పండును పురస్కరించుకొని ప్రభుత్వం రంజాన్ కిట్లను అందించిందని, వీటిని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రంజాన్ పవిత్రి మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని కోరారు. 48 మంది లబ్ధిదారులకు రంజాన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ అడ్డూరి రాజేష్, సహకార సంఘం మాజీ చైర్మన్ దోకె వెంకన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సకారాం, నాయకులు కొట్రంగి రామకృష్ణ, జావీద్ అలీ, జావీద్ హుస్సేన్, చిప్పకుర్తి దేవాజీ, ఇర్ల శంకర్, సురేష్‌గౌడ్, జలపతి, ఇగురపు వెంకటేశ్, తిరుపతి పాల్గొన్నారు.

మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుండి తొలగించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని జనజాతి సురక్ష మంచ్ జిల్లా నాయకులు మెస్రం జంగు, సిడాం బాలేరావ్, గంగారాం, అజయ్ అన్నారు. మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్‌తో బుధవారం జనజాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో చేపడుతున్న చలో ఆదిలాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతం మారిన గిరిజనులు ఎస్టీ జాబితాలో ఉంటూ రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్‌తో 29న జిల్లా కేంద్రంలో రాంలీలా మైదానంలో గిరిజన సాంస్కృతిక పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్ కస్తూరిబా పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-ముధోల్



కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పైఅంతస్తును పరిశీలించారు. ఆయా గదుల్లో మిగిలి ఉన్న పనులను వెంటనే చేయించాలని సర్పంచ్ రాజేందర్ కలెక్టర్‌ను కోరారు. పంచాయతీలో నిధుల కొరతతో ఏ అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని సర్పంచ్ వాపోయారు. అనతరం కలెక్టర్ వంటశాలను పరిశీలించారు. బాలికల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించి ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వండిన పప్పులో నీళ్ల శాతం ఎక్కువ ఉన్నాయని, పిల్లలు ఎలా తింటారని ఎస్ఓను ప్రశ్నించారు. పలు వివరాలను ఎస్ఓ ఫరత్ బేగంను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో సురేష్‌బాబు ఉన్నారు.

'మాయని రక్తం గీతలు'

జల్,జంగల్,జమీన్ పదాలు
నాడు రగల్ జెండా నినాదాలు
నాడు ఉత్తుంగ తరంగాలైన
ఆదివాసి కెరటాలు. నాడు
ఆదివాసుల వీర విహారాలు.
నేటికి మరిచిపోని గాథల జ్ఞాపకాలు.

పచ్చని చెట్ల కొమ్మల మాటున
మారు మోగిన తుపాకీ తూటాలు.
నేల రాలిన ఆదివాసి మట్టి బిడ్డలు.
ఇంద్రవెల్లి మహా సంగ్రామం
అది చరిత్రలో నిలిచి పోయిన
ఏప్రిల్ ఇరవై దినం.

వేలాది జన సమూహాల హోరు
లెక్కతేలని మృతుల వివరాలు
లెక్కకు దొరకని మృతుల
శవాల లెక్కల గురించీ...
నాటి రణంలో తుపాకీ
తూటలు మింగిన
ఆదివాసి బిడ్డలని అడుగు!
సభకు వచ్చిన జన కెరటాలనడుగు!
సాహసోపేతంగా సారథ్యం వహించిన
సాహు, శ్యామన్నలనడుగు!
మర్చురీలో శవాలు చీరిన
చేతులను అడుగు...
చెట్టు,గుట్ట,వాగు,వంకల్లో
చెల్లచెదురైనా శవాలెన్నో?

ఇప్పుడు మండుటెండలో
ఎటు చూసినా వీరుల
పరిమళాలు వీస్తునే ఉన్నాయి.
మృత వీరుల స్థూపం ముందు
గోండు గీతాలు మోకారిల్లుతున్నాయి.
తుడుమోతల్లో విషాదతప్త
ధ్వనులు వినిపిస్తునే వున్నాయి.

అక్కడికెళ్లిన వారి
నల్లని చేతులు చల్లగా స్పర్శిస్తాయి.
రాం రాం దాదా..అంటూ..
ఆదివాసీ బిడ్డల గుండెలు
జల హృదయాలు విప్పుతాయి.
ఇంద్రవెల్లి నుదుటి మీద
రాసిన రుధిర గీతాలు
అవి చెదిరిపోని అమరుల
త్యాగాల చరిత ఆనవాళ్లు.

బొల్లారపు బాబన్న
9440654585

ఇంద్రవెల్లి నెత్తుటి గాయానికి 42 ఏండ్లు


- ఆదివాసుల గుండెల్లో మానని గాయం
- కేంద్ర మంత్రి మాటలు నీటి మూటలే
- అమరవీరుల సంస్మరణ సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

1981 ఏప్రిల్ 20 సోమవారం వారాంతపు సంత రోజు. ఆదివాసులు ఎదుర్కొంటున్న భూసమస్యలు, ఆదివాసులపై అటవీ అధికారుల దౌర్జన్యాలు వంటి సమస్యల పరిష్కారం కోసం ఆదివాసులు ఏకమైన రోజు. పోడు వ్యవసాయం చేస్తూ పండించిన పంటను దళారులు తూకంలో, ధరల్లో మోసంపై ఒక్కటయ్యారు. జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో అప్పటి పార్క దొరల(అన్నలు) సాయంతో ఇంద్రవెల్లిలోని హీరాపూర్ వద్ద శాంతియుత సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ మహిళలు, పురుషులు తరలొచ్చారు.

ఆనాడు ఏమైందంటే...

42ఏండ్ల కింద జరిగిన ఆ సంఘటన రోజు ఇంద్రవెల్లి వారాంతపు సంత కావడంతో కొందరు సంతకు రాగా, మరికొందరు సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఆదివాసులు తండోప తండాలుగా రావడంతో పోలీసుల గుండెల్లో రైళ్ల పరుగెత్తాయి. భారీగా జనం రావడంతో పోలీసులు కొందరిని సభకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఓ గిరిజన మహిళకు పోలీసుకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆమె వద్ద ఉన్న కొడవలితో పోలీసు పొట్టలో పొడవంతో నేలకొరిగాడు. పరిస్థితి చేయి దాటి పోయింది. పోలీసులు అప్పటి ఎస్పీ వివేక్‌దుబేకు జరిగిన సంఘటనపై సమాచారం అందించారు. పోలీసులు, ఆదివాసుల మధ్య అగ్గి రాజుకుంది. దీంతో అప్పటి అదిలాబాద్ ఆర్‌డిఓ అంబరీష్ ఆదేశాల మేర 144 సెక్షన్‌తో పాటు కాల్పులకు అనుమతి నివ్వడంతో పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పులతో ఆదివాసులు ప్రాణాలు అర చేతిలో పట్టుకొని ఉరుకులు, పరుగులు తీశారు. ఈ సంఘటనలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తుపాకుల గుళ్లకు క్షతగాత్రులయ్యారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 13 మంది మాత్రమే మరణించారు. ఆదివాసులు మాత్రం తమ వారు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఇప్పటికీ చెబుతారు. ఏప్రిల్ 20, 1981లో జరిగిన సంఘటనకు 42 ఏండ్లు కావస్తున్నా ఆదివాసుల గుండెల్లో మానని నెత్తుటి గాయంగా పదిలంగా ఉంది.



అమరుల జ్ఞాపకార్థం ఇంద్రవెల్లి స్థూపం

అప్పటి కాల్పుల్లో అమరులైన ఆదివాసుల జ్ఞాపకార్థం స్మృతి చిహ్నంగా హీరాపూర్ వద్ద అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆదివాసుల కుటుంబాలు ఏప్రిల్ 20న సంస్మరణ సభ, శ్రద్ధాంజలి ఘటించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదు. ఆ రోజు ఇంద్రవెల్లి పరిసరాల్లో 5కి.మీ.ల వరకు 144 సెక్షన్‌తో పాటు గట్టి పోలీసు బందో బస్తును ఏర్పాటు చేస్తారు.

తెలంగాణ సర్కార్ షరతులతో కూడిన అనుమతి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత పోలీసుల నిబంధనలతో కొందరికి మాత్రమే శ్రద్ధాంజలి ఘటించడానికి ప్రతి ఏటా అనుమతి నిస్తున్నారు. అయితే ఆదివాసీ నాయకులు మాత్రం ప్రభుత్వమే అధికారికంగా అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

పాలకుల మాటలు నీటి మూటలే...

కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు 2006లో అప్పటి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ స్థూపాన్ని సందర్శించారు. మరో జలియన్ వాలా బాగ్ లాగా చారిత్రాత్మక ప్రదేశంగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ నెరవేరలేదు.



సంస్మరణ సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్

ఆదివాసుల హక్కుల కోసం అమరులైన వారి సంస్మరణ సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. అమరుల కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలి. ఆదివాసుల పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి. అంతేగాక క్షతగాత్రులకు, వారి కుటుంబాలకు పింఛన్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

ప్రమాద సూచిక బోర్డును ఢీకొన్న ద్విచక్ర వాహనదారుడు



నవతెలంగాణ-కడెం

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాద సూచిక బోర్డును ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం మండలంలోని పెద్దూర్ గ్రామానికి చెందిన శంకర్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ధర్మాజీపేట్ మూలమలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డుకు ఢీ కొట్లాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

నీటి ఎద్దడి నివారించాలని వినతి

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం బిజెపి నాయకులు గ్రామపంచాయతీ కార్యాలయంలో కారోబారికి వినతిపత్రం అందజేశారు. వారం రోజులుగా మండల కేంద్రంలోని పలు కాలనీలకు నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథకు సంబంధించిన రెండు మోటార్ల ద్వారా మండల ప్రజలకు నీటి సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుభాష్ యాదవ్, జలంధర్ పాల్గొన్నారు.

పాత్రికేయుని కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండల పాత్రికేయుడు రాజ్‌కుమార్ తల్లి రుక్మవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ భోరిగామ్‌కు వెళ్లి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ రాజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాధు రాంరెడ్డి, ఆకుల రమేష్, సుధీర్ సింగ్, నారాయణ, రమణగౌడ్ ఉన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటా

- బలమైన కారణంతోనే టీడీపీని వీడాల్సి వచ్చింది
- బీజేపీ పని కట్టుకొని అసత్య ప్రచారం చేస్తోంది
- బీఆర్ఎస్ జిల్లాఅధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ- ఆదిలాబాద్
ప్రాంతీయ ప్రతినిధి

ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని 12 పార్టీలు మార్చే వ్యక్తిని కాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. ఒక బలమైన కారణంతో ప్రజల అభీష్టం మేరకే ఆనాడు టీడీపీని వీడాల్సి వచ్చిందని తెలిపారు. బీజేపీ పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీలో చేరుతున్నారని ఓ ఛానల్, సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో బుధవారం సాయంత్రం ఆదిలాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ మారే ప్రసక్తే లేదని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా ఛానళ్లలో ప్రసారమైన వార్తలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందనే ఉద్దేశంతోనే ఆనాడు టీఆర్ఎస్‌లో చేరారని గుర్తుచేశారు. తన కుటుంబంపై అమ్మ ఛానల్ దుష్ప్రచారం చేస్తోందని, లేనిపోని అసత్య ప్రచారాలు ప్రసారం చేస్తోందని మండిపడ్డారు. సదరు ఛానల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ మార్పు విషయమై ప్రసారం చేసే ముందు తనను సంప్రదిస్తే బాగుండేదని సూచించారు. ఆదిలాబాద్‌లో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ రోజున కూడా బీజేపీ వాళ్లే జెండాలు పట్టుకొని వారే



గొడవలు చేసినట్లు తేలిపోయిందని చెప్పారు. పార్టీపై, వ్యక్తులపై దుష్ప్రచారం చేస్తే పార్టీ బలహీన పడుతుందని బీజేపీ ఎత్తుగడలు వేస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ దేశస్థాయిలో పేరు ప్రతిష్ఠలు పెంచుకుంటూ బలమైన శక్తిగా ఎదుగుతోందని దీన్ని జీర్ణించుకోలేకనే బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో దేశంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహం ప్రతిష్ఠించామని, దేశంలో అంబేద్కర్ వాదులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. కొత్తగా నిర్మించిన సచివాలయంకు కూడా అంబేద్కర్ పేరు పెట్టామని గుర్తుచేశారు. దీన్ని జీర్ణించుకోలేక బీజేపీ కుట్రలకు తెరలేపుతోందన్నారు. నూతన పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించినా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి ఆ పని చేయడం చేతకావడం లేదని విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మాదిరిగానే ఇక్కడ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేష్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జహీర్‌రంజానీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్, జైనథ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వేణుయాదవ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సభకు భారీగా తరలిరావాలి



నవతెలంగాణ-బేల

26న జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని డిసిసి జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 26న పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్నారని, దీనికి జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, వామన్, సంజయ్ గుండావార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఖానాపూర్

మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ ఛైర్మెన్ అంకం రాజేందర్, కౌన్సిలర్స్‌ను, అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్నూర్ కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా చూస్తాం

నవతెలంగాణ-కుభీర్

నియోజకవర్గంలోని మున్నూర్ కాపులు కలిసి మెలిసి ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని నియోజకవర్గ మున్నూర్ కాపు అధ్యక్షుడు రోల్లా రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని పార్డి-బి మున్నూర్ కాపు సంఘ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు వివేకానంద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కుల సోదరుల ఐక్యత కొరకు ఆర్నిశలు పాటుపడతామన్నారు. గ్రామాల్లో కుల సంఘాల భవనాలను నిర్మించేందుకు కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పువ్వుల పీరాజి, సలహాదారుడు ఏకండ్ ధర్మరాజ్, మీడియా కన్వీనర్ హనుమల్లు, సహా కార్యదర్శి చిమ్మన్ పోశెట్టి, రమేష్, తూము రాజేశ్వర్, మాజీ అధ్యక్షుడు రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ నారాయణ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పట్టణంలోని 11వ వార్డులో బుధవారం దోమల మందు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యం పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాడలో దోమలు విపరీతంగా ప్రబలుతుండడంతో మురికి కాలువల వెంబడి దోమల మందు పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలు చెత్తను మున్సిపాలిటీ వాహనాల్లోనే వేయాలని, ఆరుబయట వేయకూడదని దోమల వృద్ధికి పరిసరాల పరిశుభ్రత పాటించాలని కాలనీ వాసులకు సూచించారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వీఓఏల నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో బుధవారం స్థానిక ఐకేపీ కార్యాలయ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు ఇస్తూ, 10లక్షల సాధారణ బీమా, ఆర్మీ బీమా కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఐడి కార్డులు ఇచ్చి, జాబ్ చార్టులతో సంబంధం లేని ఇతర పనులను చేయించకూడదన్నారు. అర్హులైన ఐకేపీ వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలన్నారు.

వీవోఏల సమ్మెకు ప్రభుత్వ మే బాధ్యత వహించాలి

నవతెలంగాణ- ఖానాపూర్, కడెం

వీఓఏల సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. బుధవారం ఖానాపూర్, కడెంలో సిబ్బందితో బైటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో డ్వాక్రా మహిళా గ్రూపుల ఏర్పాటు, వాటి పటిష్ఠత, ఆర్థిక ఎదుగుదలలో కీలకపాత్ర పోషిస్తున్న వీఓఏలకు కేవలం రూ.3900 మాత్రమే గౌరవ వేతనం ఇస్తున్నారన్నారు. రోజురోజుకు పని భారం పెరుగుతూ, తీవ్రమైన రాజకీయ ఒత్తిడులకు గురవుతున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం ఏమీ లేకుండా అభద్రతతో బతుకులు ఈడుస్తున్నారన్నారు. గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని, బ్యాంక్ లింకేజిలు, 8రకాల ఆన్‌లైన్ సేవలు చేయడం, ప్రభుత్వం నుండి ఏసర్వే వచ్చినా కాదనకుండా చేసినా ప్రభుత్వ దృష్టిలో కనీస గుర్తింపు లేదన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలు వ్యక్తిగత ఖాతాకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వివోఏల సమస్యలు



పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగాధర్ పలువురు వీఓఏలు పాల్గొన్నారు. కడెంలో వివోఏ సంఘం అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు కవిత, రవి, మండల ప్రధాన కార్యదర్శి సుస్మిత, సాయికిరణ్, స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

బాసర : ఐకేపీ కార్యాలయం ముందు విఓఏలు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వం. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. సమ్మెలో విఓఏ సంఘ అధ్యక్షుడు సాయిపవన్, ఉపాధ్యక్షులు సుభద్ర పాల్గొన్నారు.

నార్నూర్ : సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించబోమని విఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు పవార్ విజయ్, మండల అధ్యక్షుడు వాగ్మారే గోవింద్ అన్నారు. బుధవారం మూడో రోజూ నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీఓఏలు శారదబాయి, చిత్రు, తాతేరావ్, దోండుబాయి, పరమేశ్వర్, విద్వాన్ పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

నవతెలంగాణ-ముధోల్

జియం ఫంక్షన్ హాల్‌లో బుధవారం తెలంగాణ ప్రభుత్వం అంధించిన రంజాన్ కానుకలను ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. మైనార్టీ గురుకులాలు స్థాపించి నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందరిని సమానంగా చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, తహసీల్దార్ తుకారాం, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, సర్పంచ్ రాజేందర్, ఎంపిటిసి భూమేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పోతన్న యాదవ్, బాబన్న, సమీఉల్లాఖాన్ పాల్గొన్నారు.

పిల్లల చదువుకు అంగన్వాడీలే పునాది

నవతెలంగాణ-ముధోల్



చిన్నపిల్లల చదువుకు అంగన్వాడీలే పునాదులని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ముధోల్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పోషకార నిలయాలుగా ఉన్నాయన్నారు. చిన్నపిల్లలకు పోషకాహారం అందే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత అంగన్వాడీ టీచర్లదేనన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పరుస్తామన్నారు. అంగన్వాడి కేంద్రాలను మాడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. త్వరలో ప్రతి అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి అంగన్వాడి భవనానికి వివిధ రకాల బొమ్మలు వేయించాలన్నారు. రక్తహీనత లోపం లేకుండా పోషకాహారం అందే విధంగా చూడాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. మినీ అంగన్వాడి కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ విజయలక్ష్మి, తహసీల్దార్ తుకారాం, సిడిపిఓ శ్రీమతి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-దిలావర్ పూర్

ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారి శ్రీనిధికి దాతలు ఆర్థిక సాయం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన మీసాల లక్ష్మీ-ముత్యం దంపతుల కూతురు శ్రీనిధి అనారోగ్యంతో బాధపడుతోంది. తలలో రక్తం గడ్డ కట్టడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. పేద కుటుంబానికి చెందిన వారికి ఆసుపత్రిలో చికిత్స చేయించేందుకు స్తోమత లేక సతమతమవుతున్నారు. అప్పోసప్పో చేసి లక్షలు ఖర్చు చేశారు. తండ్రి వికలాంగుడవడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. దాతలు ఆర్థిక సాయం చేసి కూతురుకి ప్రాణదానం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్పందిస్తున్న యువకులు, నాయకులు పెద్ద ఎత్తున ఆర్థిక సాయం చేస్తున్నారు.

ఎస్సైని సన్మానించిన మజీద్ కమిటీ పెద్దలు

నవతెలంగాణ- ఖానాపూర్

రంజాన్ మాసంలో బందోబస్తు సేవలందించిన ఎస్ఐ శంకర్‌ను బుధవారం మదీన మజీద్ కమిటీ పెద్దలు ఘనంగా సన్మానించారు. రంజాన్ సందర్భంగా మజీద్‌లలో నెల రోజుల పాటు సిఐ నారాయణ్‌నాయక్, ఎస్ఐ ఆర్.శంకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేసి సేవలందించినందుకు పోలీస్ సిబ్బందిని మదీన మజీద్ కమిటీ అధ్యక్షులు డా.చాంద్ పాషా, వార్డు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు షబ్బీర్ పాషా , మజీద్ కమిటీ ఉపాధ్యక్షులు హబీబ్‌ఖాన్, షాకిర్ ఉల్ ఖుర్-ఆన్, వార్డు విడిసి సలీం ఖాన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

రేపు అడెల్లి ఆలయంలో ఓడి బియ్యం వేలం పాట

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి పోచమ్మ ఆలయంలో శుక్రవారం సంవత్సరం పాటు ఓడి బియ్యం పోగుచేసుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి రంగు రవికిషన్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలం ఆలయ ప్రాంగణంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వ్యాపారస్తులు సకాలంలో బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్



అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక స్టేషన్ ఆఫీసర్ శివాజీ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పరిష్కరించుకొని అగ్ని ప్రమాదాల నివారణపై జిల్లా కేంద్రంలోని పలు షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్స్, వ్యాపార ప్రాంతాలలో బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

ఓటర్ జాబితా పున: పరిశీలన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం మందమర్రి మండలంలో ఓటర్ల జాబితాను మందమర్రి తహసీల్దార్ శ్రీనివాస్ రావు పున: పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో ఓటర్ జాబితాలో పేర్లు, తొలగింపులు సవరణలు ఫోటోలు, డూప్లికేట్ ఓటర్ పేర్లు ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సరిగ్గా గుర్తించారా అని క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నామని అన్నారు. పున: పరిశీలన చేసిన సంబంధిత ఫారాలు, బీఎల్ఓ లు సేకరించి వివరాలు క్షేత్ర పరిశీలనలో బీఎల్ఓలకు సమర్పించాలని చెన్నూరు ఎన్నికల అధికారి శ్రీరాములు నాయక్ ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎన్నికల, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

బాధితులకు నాయకుల పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వేరువేరు సంఘటనల్లో గాయపడ్డ బాధితులను జిల్లాలోని నాయకులు బుధవారం పరామర్శించారు. మండలానికి చెందిన కౌటగూడా గ్రామస్తులు ఉపాధి హామీ కూలికి వెళ్లి తేనెటీగలు కుట్టి గాయపడటంతో జిల్లా ఆస్పత్రిలో చైర్‌పర్సన్ కోవలక్ష్మి పరామర్శించింది. నాణ్యమైన వైద్యం చేయాలని సిబ్బందిని ఆదేశించింది. బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పింది. నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులు హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వారిని పరామర్శించారు. అంకుశపూర్ సర్పంచ్ పార్వతి బాయ్ అనారోగ్యంతో యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుండగా ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అంబేద్కర్ విగ్రహావిష్కరణకు బయలుదేరుతూ గాయపడ్డ చునార్కార్ వీరలింగయ్యను పరామర్శించి పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



నవతెలంగాణ-దండేపలి

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కొక్కీరాల సురేఖ ప్రేమ్ సాగర్‌రావు మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో ఐకేపీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలియజేశారు. గత 15 రోజులుగా ఐకేపీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. మహిళల అభ్యున్నతికి, ప్రభుత్వ కార్యక్రమాలలో ఐకేపీఓఎల్ కీలకపాత్ర అని అటువంటి వారికి కేవలం రూ.3900 గౌరవ వేతనం చెల్లిస్తూ వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శమని అన్నారు. వారికి గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటికి ఏ ఒక్క ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని కూడా కనుబదీకరించలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐకేపీ ఉద్యోగులకు భద్రత కల్పిస్తూ కనీస వేతనాలు చెల్లిస్తామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్య తరగతి ప్రజలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్య తరగతి ప్రజలను విస్మరిస్తున్నాయని దానికి నిదర్శనం నేడు ధరల పెరుగుదల అని విమర్శించారు. బుధవారం దండెపల్లి మండల కేంద్రంలో ముస్లింలకు రంజాన్ తోఫాను కొక్కిరాల రఘుపతి రావు టెస్ట్ ద్వారా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాము అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని గుర్తు చేశారు. కానీ అధికార పార్టీ నాయకులు అధికారంలో ఉన్న కూడా ప్రజలను పట్టించుకోరని ఆమె విమర్శించారు. ఈ సేవ కార్యక్రమాలను మరో పది సంవత్సరాల పాటు కొనసాగిస్తామని ఆమె అన్నారు. తమకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ చట్టం జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, జడ్పీటీసీ గడ్డం నాగరాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వనపర్తి రవి, మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు శంకరయ్య, చంద్రకళ, ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, బొడ్డు కమలాకర్, తోట మోహన్, కొంగల నవీన్ పాల్గొన్నారు.

ప్రజల్లో వెలుగులు నింపేందుకే కంటివెలుగు శిబిరాలు



నవతెలంగాణ-జన్నారం

ప్రజల మేలు కోసమే కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మండలంలోని రాంపూర్ గ్రామ సర్పంచ్ సులోచన రవి, ఎంపీటీసీ దర్శనాల వెంకటస్వామి అన్నారు. బుధవారం రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, మందులు గోళీలు ఇచ్చి అవసరమైతే కంటి అద్దాలు ఉచితంగానే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పోసాని, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఏఎన్ఎం లు అపరంజి, మాధవి, అంగన్వాడీ టీచర్లు, సుశీల, సంధ్య పాల్గొన్నారు.

'దుర్వాసన భరించలేకపోతున్నాం'

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో ని ఐబీ, సుభద్ర కాలనీ, చెక్ పోస్ట్ ఏరియాలో పందుల కళేబరాలను వేయడం వల్ల దుర్వాసన భరించలేకపోతున్నామని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాబీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పందుల పెంపకం దారులు చనిపోయిన పందుల కళేభారాలను జనావాసాలకు దగ్గర పడవ వేస్తుండడంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలను కోరారు.

హత్య కేసులో ఒకరికి రిమాండ్



నవతెలంగాణ-జన్నారం

మండలం మల్యాల గ్రామానికి చెందిన పడితె పోచంను హత్య చేసిన నిందితుడు దోసాన్ల సుమన్‌ను పట్టుకొని రిమాండ్‌కు పంపినట్టు లక్షెట్టిపేట్ సీఐ వై.కృష్ణారెడ్డి, జన్నారం ఎస్సై పి.సతీష్ తెలిపారు. బుధవారం జన్నారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రిక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన సుమన్‌కు పెదనాన్న అయిన పడితే పోచం, అధికంగా మద్యం సేవించవద్దని, మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేసుకోవాలనీ, మంచిగా బ్రతకాలని నచ్చజెప్పిన కోపంతో ఊగిపోయిన సుమన్, తెల్లవారుజామున తన పని ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో అడవిలో చాటుగా ఉండి కర్రతో కొట్టి పోషమును చంపినానని, నిందితుడు సుమన్ ఒప్పుకున్నాడని తెలిపారు.

వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్రంలో సెర్ప్ సంస్థలో గత 20 ఏండ్ల నుండి పనిచేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏండ్ల నుండి ఐకేపీలో వీఓఏలుగా పనిచేస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వీఓఏలకు పనికి తగిన వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకోవడం బాధాకరమన్నారు. ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం నిర్ణయించి అమలుచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాదారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఆన్‌లైన్ పనులు రద్దుచేయాలని, సెర్ప్ నుండి ఐడీ కార్డులు ఇవ్వాలని, ప్రతి సంఘానికి పక్కా భవనం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి, వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జాడె అనిల్‌కుమార్, మండలాధ్యక్షుడు అంగాల సతీష్, నాగపురె పాండు, ప్రధాన కార్యదర్శి గొర్కుటె జయంత్, బానోత్ అంబావతి, స్వప్న, ప్రేమల, సునీత, జ్యోతి, నిర్మళ పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలో ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవరా ఎంపీపీ విమలాబాయికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకరిస్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : వీఓఏలు చేస్తున్న సమ్మె మూడవరోజు కలెక్టరేట్ ఎదుట కొనసాగగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి వీఓఏలు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారని అన్నారు. వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మూడో రోజు సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, సహాయ కార్యదర్శి రాజేందర్, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు బుద్దు, కార్యదర్శి రమ, నాయకులు ఓమాజీ, పద్మ, ఫార్జానా, ప్రమోద్, జయలక్ష్మీ పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- వివిధ పార్టీ నాయకుల డిమాండ్
- టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ మీడియా రంగాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కొమరంభీం జిల్లా శాఖ అధ్యక్షుడు గణపురం మహేష్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌రావు అధ్యక్షతన ఆసిఫాబాద్‌లోని జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించిన "జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాల మంజూరుకై సంతకాల సేకరణ" కార్యక్రమానికి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం జర్నలిస్టులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కొమురంభీం జిల్లాలో 2011లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందజేశారని, అప్పటినుండి ఎంతోమంది ఈ రంగంలోకి వచ్చినప్పటికీ వారికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం శ్రద్ధ చూపాలని తెలిపారు. సమాజానికి సేవ చేసే జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అక్రిడేషన్ కార్డుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టు ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెండో విడత అక్రిడేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌రావు మాట్లాడుతూ జర్నలిస్టులకు రైల్వేలో గతంలో రాయితీ ఉండేదని ప్రస్తుతం దానిని రద్దు చేశారని వెంటనే రాయితీ పునరుద్దరించాలన్నారు. జర్నలిస్టు వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న అనేకమంది ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణకు వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కృష్ణమోహన్‌గౌడ్, మహమ్మద్ ఆసిఫ్, రవి, బాలాజీ, జలీల్, శ్రీకాంత్, జయంత్, రాజు, ధనుంజయ్, ప్రకాష్, అశోక్‌గౌడ్, ఖలీల్, లలిత్, మహేష్, వెంకటేష్, శివ, మొయిన్, సంతోష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు భోజన ఏర్పాట్లు

నవతెలంగాణ-హాజీపూర్



వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు భోజనం, త్రాగు నీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు మంచిర్యాల కలెక్టర్ బాధావత్ సంతోష్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి మండలంలోని పడ్తనపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రబీలో పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా జిల్లాలో 244 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దీని కోసం 56 లక్షల గన్ని సంచులు అవసరం కాగా ప్రస్తుతం 19లక్షల సంచులు అందుబాటులో వున్నాయని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2060, బీ గ్రేడ్ ధర రూ.2040 ప్రభుత్వ మద్దతు ధర అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ రైతు పక్షపాతి కాబట్టే కేంద్రం కొనుగోలు చేయకపోయినా రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నరని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో వరి సాగు విస్తీర్ణం పెరిగి రూ.కోట్ల పంటలు పండు తున్నయన్నరు. గూడెం లిఫ్ట్ ద్వారా దండేపల్లి, లక్షెట్టిపెట్, హాజీపూర్ మండలాల్లో ఈ రబీలో రూ.150 కోట్ల వరి ధాన్యం సాగైదని తెలిపారు. రాబోవు రోజుల్లో కర్ణమామిడి లిఫ్ట్ పనులు మొదలవుతాయని, అదనంగా మరో 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా సహకార అధికారి కీష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ రామారావు, సర్పంచులు గోళ్ల శ్రీనివాస్, కొట్టే మహేందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే వేజ్‌బోర్డ్ ఆలస్యం




నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే వేజ్ బోర్డ్ ఆలస్యం అవుతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ అన్నారు. బుధవారం కేకే-5 గనిపై ఆ గని సీఐటీయూ పిట్ సెక్రెటరీ మేడి రాజమల్లు ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు గోపాల్ మాట్లాడుతూ మంగళవారం కోల్ కత్తాలో జేబీసీసీఐ జరిగిన సమావేశంలో వేతన ఒప్పందం విషయాలను తెలియజేసిన అనంతరం డీపీఈ గైడ్లైన్స్ సవరణకు కేంద్ర ప్రభుత్వం బొగ్గు రంగంకు అనుమతులు ఇవ్వకపోవడం వలన వేజ్ బోర్డు ఆలస్యమవుతుందని విమర్శించారు. జనవరిలో నిర్వహించిన సమావేశంలో 19శాతం అగ్రిమెంట్ జరిగిన అనంతరం కేంద్రం అనుమతుల కోసం అడిగితే ఇంతవరకు ఇవ్వలేదని, తూతూ మంత్రంగా మంగళవారం వేజ్ బోర్డు సమావేశం యాజమాన్యం నిర్వహించిందని విమర్శించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం డీపీఈ గైడ్లైన్స్ సవరణకు అనుమతించి బొగ్గు రంగానికి మినహాయింపులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్లు చిత్తశుద్ధిగా కోల్ ఇండియా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్న కూడా కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయడానికి చూస్తుందన్నారు. ముఖ్యంగా బొగ్గు రంగాన్ని నిర్వీర్యం చేయాలనే బొగ్గు గనుల వేలం చట్టాన్ని తీసువచ్చిందన్నారు. ఇప్పుడు బొగ్గు గని కార్మికుల వేతనాల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం పెట్టిన గైడ్లైన్స్ అడ్డంకిగా మారాయని అన్నారు. సింగరేణి యాజమాన్యం కూడా కార్మికుల సంక్షేమంపై పట్టించుకోవడంలేదని గతంలో వేసవి సమయంలో సమయ వేళలు మార్చిన ఈ వేసవి కాలంలో గుర్తింపులో కొనసాగే సంఘాలు యాజమాన్యం దృష్టికి ఎందుకు తిసుకెళ్లటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కార్మికులందరూ పూర్తిస్థాయిలో కదిలితే తప్పకుండా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఏ యూనియన్ వచ్చినా ఇంటి కిరాయిపై తప్పకుండా ప్రశ్నించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మహమ్మద్ ఆరిఫ్, బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట స్వామి, అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వి ఐలయ్య, సంజీవ్, భేతి భరత్, లింగాల రమేష్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ టీపీ అధికార ప్రతినిధి నరేష్ నాయనమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకేని రాము, జన్నారం మండల అధ్యక్షుడు ఏ పురుషోత్తం రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో ఈ చిరు సాయం చేశామని వారు తెలిపారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎం.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జి.అర్జున్, నాయకులు శ్రీధర్ పాల్గొన్నారు.

పోలీస్ ఫైరింగ్ రేంజ్ ప్రారంభం



నవతెలంగాణ-వాంకిడి

జిల్లాలో నూతనంగా ఏర్పాటుచేసిన పోలీస్ ఫైరింగ్ రేంజ్‌ను ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మండలంలోని ఇందానీ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన పోలీస్ ఫైరింగ్ రేంజ్‌ను నార్త్‌జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఐజీ మాట్లాడుతూ గతంలో జిల్లా పోలీస్ పరిధిలో విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బంది మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ శిక్షణ నిర్వహించే వారని, దానిని దృష్టిలో ఉంచుకొని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ ప్రత్యేక ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారని తెలిపారు. దీనికి వాంకిడి మండలకేంద్రంలోని ఇందానీ గ్రామ శివారులో పోలీస్ శాఖకు చెందిన 11 ఎకరాల భూమిలో ఫైరింగ్ రేంజ్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు ట్రైనీ కానిస్టేబుళ్లకు కూడా ఇదే ఫైరింగ్ కేంద్రంలో ప్రాక్టీస్ చేస్తారన్నారు. ఫైరింగ్ రేంజ్ నిర్మాణంలో శ్రమించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఐజీ అభినందనలు తెలిపారు. దీనికి సహకరించిన వారికి ఐజీ చేతులమీదుగా సన్మానించారు. ఈ శిక్షణలో 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్ల వరకు కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, జిల్లా అదనపు ఎస్పీ ఏఆర్ భీంరావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్స్ అందజేత



నవతెలంగాణ-వేమనపల్లి

నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాతనపల్లి గ్రామంలో జైపూర్ ఏసీపీ నరేందర్, సీఐ విద్యా సాగర్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం యువతకు క్రికెట్ కిట్స్ అందించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ యువత చెడు మార్గాలు వైపు వెళ్లకుండా ఏజెన్సీలో ఇలాంటి కార్యక్రమాలు పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, భవిష్యత్తులో క్రీడలతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలకు అవకాశం ఉంటుందని అన్నారు. చిన్నప్పటి నుండి క్రీడల పట్ల అవగాహన కలిగి ఉండాలని, దీనితో ఆరోగ్యంగా ఉండి ఉన్నత లక్ష్యాలు సాధిస్తారని అన్నారు. పోలీసులు యువతకు ఎల్లవేళలా సహకరిస్తామని, యువతను ప్రోత్సహించటంలో పోలీస్‌లు ముఖ్య పాత్ర వహిస్తామని తెలిపారు. యువకులు గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు, ఇతర చెడు, సంఘ విద్రోహశక్తుల వైపు వెళ్లకుండా చదువుపై, భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అన్నారు. అసాంఘిక శక్తుల గురించిన ఎటువంటి సమాచారమైనా పోలీసుల కు అందించాలని అన్నారు.

ఇంటింటికి సీపీఐ పోరుయాత్ర



నవతెలంగాణ-తాండూర్

ప్రజలను జాగృతం చేసి ప్రజా హక్కులపై పోరాటం చేసేందుకు చేపట్టిన సీపీఐ ప్రజా పోరు యాత్ర బుధవారం మండలంలోని బోయపల్లి, చౌటపల్లి, కిష్టంపేట గ్రామాల్లో కొనసాగింది. రెండవ రోజుచేపట్టిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ పాల్గొన్నారు. రేగుంట చంద్రశేఖర్ సారథ్యంలో కొనసాగుతున్న ఈ ప్రజా పోరు యాత్రలో ప్రజా పోరు దళ సభ్యులు దాగం మల్లేష్, సాలిగామ సంతోష్, బొంతల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రేగుంట చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పోడు వ్యవసాయంపై ఆధారపడ్డ నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన బొగ్గు బావులను ప్రారంభించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు నియోజకవర్గం సహాయ కార్యదర్శి మామిడాల రాజేష్, జిల్లా సమితి సభ్యులు గుండ చంద్రమాణిక్యం, బియ్యాల ఉపేందర్, అక్కపెల్లి బాబు, దాడి గట్టయ్య పార్టీ నాయకులు ప్రహ్లాద్, కామెరా మల్లయ్య, రత్నం రాజం, భరత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని ద్వారకాపూర్, కాసిపేట గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. డంపింగ్ యార్డులలో తడి పొడి చెత్త సేకరణ పట్ల నిర్లక్ష్యం వహించరాదని, వర్మీ కంపోస్ట్ తయారీలో శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం కొత్తపల్లి రైతు వేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆర్యవేక్షించారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. ద్వారకాపూర్ క్రీడా మైదాన స్థలం ఎంపిక కోసం ఆర్ఐ మురళీధర్‌రావుతో కలిసి క్షేత్ర స్థలపరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ సత్యనారాయణ, పంచాయతీ సెక్రెటరీ సురేష్ కుమార్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 20 ఏప్రిల్ 2023

టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జడ్పీటీసీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలోని టూరిజం ప్రదేశాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఉద్యోగోన్నతి పొందిన వైద్య ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



ఇటీవల వైద్య ఆరోగ్య శాఖలో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు గోపి, అడప మహేందర్, గుజరాత్ గోపిలను టీఎన్‌జీఓ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎ.నవీన్ కుమార్ సన్మానించారు. బుధవారం వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారిని శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఏ.తిరుమల్‌రెడ్డి, ఆసూరి ప్రవీణ్, అరుణ్, రాజేశ్వర్, సునీల్, సంజయ్, అఖిల్, సాయి కృష్ణ, విజయ, అనురాధ, సిరాజ్ పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం వీఓఏ నిరవధిక సమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వీఓఏల సంఘం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26000 చెల్లించాలన్నారు. ఐడీ కార్డు గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వ్యక్తి గత ఖాతాలో వేయాలని కోరారు. తమతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించాలని చేపడుతున్న సమ్మెను వీఓఏలు విజయవంతం చేయాలన్నారు. సమ్మె శిబిరాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గైని మురళీమోహన్ వచ్చి సంఘీభావం తెలిపారు. వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నిర్మల్ : వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. బుధవారం వీఓఏల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రూ.10 లక్షలు సాధారణ భీమ, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. మహిళలకు రావలసిన అభయ హస్తం డబ్బులు ఇవ్వాలన్నారు. వీఓఏలకు సెర్ప్ నుండి ఐడి కార్డులు ఇవ్వాలని, సమస్యలును వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు నల్ల అశోక్, అకొండపేట గ్రామ సర్పంచ్, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు దుర్గం పోశలింగం, ఐకేపి, వీఓఏల సంఘం నిర్మల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సారుగు సాయన్న, ఎస్.గోదావరి, ఏలిశెట్టి గాయత్రీ, ఒడిగే పోశెట్టి పాల్గొన్నారు

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఆయాగ్రామాలలో జరుగుతున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూలీలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పని జరిగే చోట కూలీలకు టెంట్లు, త్రాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల వివరాలు తదితర అంశాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, ఏపీఓ శిరీషరెడ్డి పాల్గొన్నారు

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన

నవతెలంగాణ-తలమడుగు

మండలంలో కొంతమంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నడంతో ఆ రైతులకు బుధవారం ఉమ్డం గ్రామ రైతు లక్ష్మారెడ్డి చేనులో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్‌పై శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నప్పటికీ అంతర పంటగా ఇతర పంటలను సాగు చేసి లాభాలు పొందవచ్చు అన్నారు. ఆయిల్ ఫామ్‌లో సాగు చేసే విధానంలో మరి అంత ఎత్తుగా పెరిగే పంటలు పండించవద్దన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో చీడ పీడల నివారణ తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్తలు అనంతరావు, రామ్మోహన్‌రావు, వ్యవసాయ శాఖ అధికారులు మహేందర్, సౌజన్య, యోగేష్, మహేష్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రజల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం స్థానికులకు మంచినీటిని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దష్ట్యా పాదాచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఆదిత్య కందేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఆదిత్య ఖండేష్కర్, నాయకులు మెట్టు ప్రహ్లద్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, కౌన్సిలర్ ప్రకాష్, సొసైటీ సభ్యులు సాయి, సందీప్, కృష్ణ, శివాజీ, సతీష్, ఉత్తం పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనులు వెంటనే పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మన ఊరు-మన బడి పథకం క్రింద పాఠశాలల్లో చేపట్టిన పనులను వెంటనే పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన ఊరు-మన బడి, మన బస్తి-మన బడిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మన ఊరు-మన బడి పథకం క్రింద ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మొదటి విడతలో చేపట్టిన పనులను ఈ నెల 30లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులు, త్రాగునీరు, ప్రహరీగోడ, వంటగది, మరుగుదొడ్లు, విద్యుత్, పేంటింగ్, తదితర పనులను పూర్తిచేయాలని సూచించారు. పంచాయితీ రాజ్, రోడ్లు భవనాలు, గిరిజన సంక్షేమం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపడుతున్న పనుల పురోగతిపై శాఖల వారీగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా విద్య శాఖ అధికారిణి టి.ప్రణీత, సెక్టోరల్ అధికారి నారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం తీసుకొని ఇంటికి వచ్చిన ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కెరావ్, శ్యాంపూర్ గ్రామానికి చెందిన ఉట్నూర్ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ వారిని పరామర్శించారు. ఎన్ఆర్ఐ, బీఆర్ఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు భూక్య జాన్సన్ నాయక్‌తో స్థానిక నాయకులతో ఇరు బాధిత కుటుంబ సభ్యులు పరామర్శించారు. వారి వెంట ఎంపీపీ పంద్రా జైవంత్ రావు, సర్పంచ్ మల్లిక, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, నాయకులు రవీందర్, రమేష్, హరీష్, స్వామి ఉన్నారు.

టీఏజీఎస్ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



భద్రాచలంలో మే 5, 6, 7 తేదిల్లో నిర్వహించే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రం కిష్టన్న, పూసం సచిన్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో మహాసభలకు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల సచిన్ మాట్లాడుతూ తెలంగాణ ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ, స్వయం పాలన, హక్కులకై పోరాటం అనే నినాదంతో ఏర్పడిందని అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్రంలో గిరిజన సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. అంతేకాదు తమ సంఘం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలపై ఛాంపియాన్ పోరాటాలని నడిపిందని పేర్కొన్నారు. భద్రాచలంలో ఏర్పాటుచేసిన 3వ మహాసభలలో గిరిజన సమస్యలు వాటి పరిష్కారానికి తీర్మానాలు చేయడం జరుగుతుందని వివరించారు. రాష్ట్ర మహాసభలకు జాతీయ నాయకులు మిడియం బాబురావు, బృంద కరత్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరువుతారని తెలిపారు. ఆదివాసులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బైరి సోమేష్, జిల్లా నాయకులు ఉయిక విష్ణు, కనక మలుకు పాల్గొన్నారు.

రాష్ట్రంపై కేంద్రానిది కపట ప్రేమ

- సొంత నిధులతోనే రాష్ట్రాభివృద్ధి
- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని, ఇప్పటివరకు రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని రాష్ట్ర అటవీ, దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నిర్మల్ పురపాలక సంఘ సర్వసభ్య అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ త్వరలోనే సీఎం కేసీఆర్ నిర్మల్ జిల్లా కేంద్రానికి రానున్నారని తెలిపారు. నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు నిధులు కేటాయించాలని సీఎంకు విన్నవిస్తామని తెలిపారు. ప్రతీ వార్డుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మాత్రం ప్రభుత్వాలను కూలగొడుతూ ముఖ్య మంత్రులను మారుస్తుందని, మహారాష్ట్రలో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. రాష్ట్ర నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. కేంద్రం కక్ష్యసాధింపు ధోరణిని ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలు శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ నిర్ణేతలని అన్నారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చించోలి-బి సమీపంలోని వొకేషనల్ సెంటర్ ఏర్పాటుపై బీజేపీ నేతలు నానా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఈద్గాతో పాటు అక్కడ వొకేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గతంలో ఆలయాల నిర్మాణలకు కూడా స్థలాన్ని కేటాయించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పెంటర్స్ భారీ ర్యాలీ

నవతెలంగాణ-మంచిర్యాల



విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పెంటర్‌ల సమస్యల పరిష్కారం కోసం బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్పెంటర్ కార్మికుల మూడు రోజుల బందును పాటించారు. స్థానిక సంఘం భవనం నుంచి ఐబీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కార్పెంటర్ రేట్లు పెంచి అందరికీ ఒకే రేట్ల పట్టికతో పనిచేయడం వల్ల అందరికీ పనులు దొరికే అవకాశం ఉంటుందన్న సదుద్దేశంతో బంధు కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. రేట్ల విషయంలో అవగాహన కల్పిస్తూ విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ భావితరాలకు కూడా ఉపయోగపడే విధంగా తయారు చేసినట్లు తెలిపారు. రేట్ల పట్టిక పుస్తకాలను అమ్మవారిలోని సంఘం భవనంలో అందరి పెద్దల సమక్షంలో రిలీజ్ చేసి అందరికీ అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అక్కనపెల్లి మధు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి పురుషోత్తం, జిల్లా అధ్యక్షులు మడుపు రాంప్రకాష్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షులు మట్టెల రమేష్ చారి, గౌరవ అధ్యక్షుడు నాగవెల్లి రాజు, వీరు కొత్తూరు రాజన్న పాల్గొన్నారు.

ఎల్లపల్లి గ్రామంలో ఉద్రిక్తత

- కుమారుడిని హత్య చేశాడని ఓ వ్యక్తిపై దాడి
- పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మండలం ఎల్లపల్లి గ్రామంలో బుధవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలో మంగళవారం అనుమానస్పద స్థితిలో ఉరివేసుకుని మృతి చెందిన గొర్లకాపరి నవీన్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కక్ష్య పూరితంగా గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని అశోక్, తన డ్రైవర్ కలిసి నవీన్‌ను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, అశోక్ ఇంటిపై దాడి చేసేందుకు యత్నించారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. ఇరువురిని శాంతింప చేసే క్రమంలో ఆందోళన చేస్తున్న వారు రాళ్ళు విసారు. దీంతో ఓ పోలీసుకు గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఆందోళనలు జరగకుండా గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో భారీ బందోబస్తు చేపట్టారు. గ్రామంలోకి బయటి వ్యక్తులు వెళ్లకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని మసీదులో ప్రభుత్వం తరుపున బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్‌గుప్తా, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్, రైతు బంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, ఎఆర్ఎస్ వ్యవస్థాపకులు శంకర్ నాయక్, సర్పంచులు బొడ్డు గంగన్న, గొల్ల వేణుగోపాల్, దస్తురాబాద్ ఎంపీపీ కిషన్ పాల్గొన్నారు.

అడెల్లి ఆలయాన్ని దర్శించుకున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి పోచ్చమ్మ ఆలయాన్ని బుధవారం జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఆయన మొదటి సారిగా అడెల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీకి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు పట్టం కడుతారని ఆశాభావం వ్యక్తచేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ్, రాజేశ్వర్, మండల నాయకులు భోజగౌడ్, భీంరావు, అహమ్మద్ ముక్తార్, లక్ష్మణ్, సురేష్, సుధాకర్ ఉన్నారు.

ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.సతీష్



నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.సతీష్ అన్నారు. బుదవారం తాడిహత్నూర్ గ్రామంలోని రైతు వేదికలో తడిహత్నూర్, జామడ, గుంజాల, గంగాపూర్, బలాంపూర్, నాగల్ కొండ, బేతల్‌గూడ గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజలకు రైతులకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సహాయం, ఫ్రి లీగల్ ఎయిడ్, మెంటేనేన్స్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని వద్దని, లైసెన్స్ కల్గిన ఫెర్టిలైజర్ షాప్‌లో విత్తనాలు మందులు తీసుకొని రశీదు పొందాలన్నారు. ముగ్గురు పారా లీగల్ వాలింటర్ ను నియమించి వారిని శిక్షణ ఇస్తామని వారితో న్యాయ సలహా సూచనలు పొందాలన్నారు. ముందుగా అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ మూర్తి ప్రమీల జైన్, ఉట్నూర్ కోర్టు న్యాయ మూర్తి టి.దుర్గా రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పేందుర్ ప్రభాకర్, న్యాయ మూర్తులు బానోత్ జగన్, జైవంత్ రావ్, గుప్త, బాపురెడ్డి, నతరి రాజు, సీఐ ప్రేమ్ కుమార్, ఎస్సై రవికిరణ్, ఏఓ రమేష్, గ్రామ సర్పంచ్‌లు మధుకర్ రాథోడ్, సావిత్రి బాయి, ఆత్రం పరమేశ్వర్ పాల్గొన్నారు.

తాగు నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



నార్నూర్ : మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో గత వారం రోజుల నుంచి తాగు నీరు రాకపోవడంతో ఆ కాలని మహిళలు బుధవారం రొడ్డెక్కారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం కోట్లకు కోట్లు నిధులు వెచ్చించి ప్రతి ఇంటికి నీరందిస్తామని ప్రచారం చేసుకుంటుందని కాని, ఏ ఒక్క ఇంటికి తాగు నీరు సరఫరా కావటంలేదన్నారు. ఇప్పటి కైన ప్రజాప్రతినిధులు అదికారులు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీడీఓ రమేష్ స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్ మహిళలను సముదాయించి రెండు రోజుల్లో నీటి సరఫరా అయ్యేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. నిరసన కార్యక్రమంలో మహిళలు తాయా బాయి, రుక్మాబాయి, యశోద బాయి, సునీత పాల్గొన్నారు.

బీమాతో ధీమా

నవతెలంగాణ-కోటపల్లి

ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలతో ప్రతి వ్యక్తికి భరోసా ఉంటుందని సిర్మ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుశాంత్ అన్నారు. గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధ్వర్యంలో పథకలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష యోజన బీమా పథకం 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వారికి అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ పథకం రూ.20 తో భీమా చేసుకోవచ్చని తెలిపారు. పథకం కింద ప్రమాద కవరేజీ ప్రమాదవశాత్తు మరణం, పూర్తి వైకల్యానికి రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.1 లక్ష, ప్రీమియం ఉంటుందని తెలిపారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పాలసీ టర్మ్ ఏడాది మాత్రమే ఉంటుందనీ అందువల్ల ప్రతి ఏడాది రూ.436 కట్టాలని అన్నారు. తరువాత పాలసీ రెన్యూవల్ అవుతూ వస్తుందిఅని, ఇలా డబ్బులు కట్టి పాలసీ తీసుకున్న వారు ఏ కారణం చేతనైనా మరణిస్తే అప్పుడు ఆ కుటుంబ సభ్యులకు లేదంటే నామినీకి రూ.2 లక్షల అందుతాయన్నారు. ఈ పథకంలో చేరాలనుకునే వారు బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే సరిపోతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ భీమా చేసుకొని ధీమాగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్, సీఎస్పీలు కాసర్ల విజయ్, అంబాల సుధాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాసులకు దరఖాస్తులు

రామకృష్ణాపూర్ : మంచిర్యాల ఆర్టీసీ డిపో వారి ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత బస్ పాసులను పొందేందుకు దరఖాస్తులను స్వీకరించారు. స్థానిక 17వ వార్డు వర్తక సంఘం గణేష్ మండపంలో లయన్స్ క్లబ్ సఖి వారి ఆధ్వర్యంలో బస్ పాస్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ రామిడి ఉమాదేవి-కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ సఖి మంచిర్యాల సెక్రటరీ లింగంపెల్లి మంగ, సభ్యురాలు గడ్డం విజయ, మెప్మా టీఎంసీ శ్రీధర్, అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రవి, పట్టణ అధ్యక్షులు మారేపెల్లి నరేష్, ఆర్టీసీ బస్ పాస్ ఇన్‌చార్జి కేశన్న, బీఆర్ఎస్ యువ నాయకులు రామిడి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయునికి శ్రద్ధాంజలి

ఆదిలాబాద్ టౌన్ : పట్టణంలోని శర్వాణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంట రాందాస్ అకాల మరణం చెందటంతో బుధవారం పట్టణంలోని ప్రయివేట్ ఐటీఐ కళాశాల, శర్వాణి పాఠశాల యాజమాన్యం శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్‌జీఓ అధ్యక్షుడు సంద అశోక్, రేవతి బహన్ హాజరయ్యారు. ఈ మేరకు రాందాస్ చిత్రపటానికి కళాశాల, పాఠశాల డైరెక్టర్ కోడిమెల ఆశన్న, రాజారెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘు, అధ్యాపక సిబ్బంది, బంధువులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణలో కమిటీల పాత్ర కీలకం

లక్ష్మణచాంద : బాలలపై జరుగుతున్న వివిధ రకాల వివక్షను రూపుమాపటంలో బాలల సంరక్షణ కమిటీల పాత్ర కీలకమని బాలల సంరక్షణ అధికారి మురళీ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వరల్డ్ విజన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆమాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయటంలో పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. గ్రామస్థాయిలో బాలల పరిరక్షణ కమిటీ యొక్క పాత్ర చాలా ప్రాముఖ్యమైనదని వాటిని బలోపేతం చేయడానికి వరల్డ్ విజన్ కషి చేస్తున్నదని వరల్డ్ విజన్ మేనేజర్ బ్రహ్మన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఎంపీఎ నసీరుద్దీన్, ఐకేపీ ఏపీఓ వాణిశ్రీ పాల్గొన్నారు.